# దేశమంటే డాలర్లోయ్!

ఆదెళ్ళ శివకుమార్


*"భారతీయులంత సోమరిపోతుల్ని ఈ ప్రపంచంలో ఎక్కడా చూళ్ళేదు..." ఈ కామెంట్ చేసింది ఏ జర్మనో, రష్యనో, జపనీనో కాదు.*

*సుబ్బారావుగాడు.*

*అచ్చతెనుగు ఆంధ్రుడు. ప్రస్తుతం ఇక్కడ వుండకపోయినా ఇరవైనాలుగేళ్ళపాటు ఈ దేశం తిండితినీ గాలిపీల్చి ప్రస్తుతం కాలిఫోర్నియాలో సెటిలయిన నాన్ రెసిడెన్షియల్ ఇండియన్.*

సుబ్బారావుగాడూ నేనూ చెడ్డీల టైము నుండీ స్నేహితులం. కృష్ణాజిల్లా ఓ మారుమూల గ్రామంలో మావిద్దరివీ పక్కపక్క ఇళ్ళు. పలకా, బలపం పట్టుకుని చీమిడి ముక్కులేసుకుని జారిపోతున్న లాగుల్ని పైకి లాక్కుంటూ వీధిబడికెళ్ళినప్పటి నుంచి నారోకట్ ప్యాంట్లతో సిగరెట్స్ వూదుతూ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తిచేసేంత వరకూ క్లాసమేట్స్‌మేమిద్దరం.

ఇంజనీరింగ్ అయిన రెండేళ్ళ తర్వాత సుబ్బారావు అమెరికా ఎగిరి పోయాడు.



నాలో రిస్క్ తీసుకునే ప్రవృత్తీ, డైనమిజం కాస్త తక్కువ. అందుకే 'డాలర్ల కొండకి' వెంట్రుక కట్టి లాగ లేక ఇండియాలోనే వుండిపోయాను. ఇదంతా జరిగి ముప్ఫైఏళ్ళయ్యింది. ఈకాలంలోఎలక్ట్రిసిటీ బోర్డులో నేను ఇంజనీర్‌గా స్థిరపడ్డాను. భార్య, ఇద్దరు పిల్లలతో సంతృప్తిగానే వున్నాను. రిటైర్ అయిన తర్వాత కూడా జీవితం ప్రశాంతంగానే సాగిపోతుందన్న నమ్మకం వుంది.

ఇక సుబ్బారావుగాడి సంగతికి వస్తే అమెరికా వెళ్ళగానే వాడు పేరు కుదించు కుని పీ.యస్.రావు అయిపోయాడు. మొదట్లో బంకుల్లో పెట్రోలు కొట్టటం, రెస్టారెంట్స్‌లో వెయిటర్‌గా పనిచేయటం వంటివి చేసినా సంవత్సరంన్నరలో కన్సల్‌టెంట్‌గా మారిపోయాడు.

అప్పటికింకా ఇంటర్‌నెట్, ఈమెయిల్స్ వంటివి లేవు కాబట్టి ఉత్తరాలు రాసుకుంటూ, ఫోన్లలో మాట్లాడుకుంటూ వుండేవాళ్ళం. మొదట్లో "ఇక్కడి లైఫ్ చూస్తుంటే భయమేస్తుందిరా!" అని సుబ్బారావు టెన్షన్ ఫీలయినపుడు నేను ధైర్యం చెప్పేవాడిని. కొద్దికాలంలోనే వాడు బాగా తేరుకున్నాడు.

అమెరికా వెళ్ళిన ఆరేళ్ళ తర్వాత సుబ్బారావు మొదటిసారిగా ఇండియా వచ్చాడు.

రిసీవ్ చేసుకోవటానికి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళిన నేను సుబ్బారావును గుర్తుపట్ట లేనంతగా మారిపోయాడు. సన్నగా ములక్కాడలా వుండేవాడు బూడిద గుమ్మడి కాయలా తయారయ్యాడు. సూట్‌లో సుబ్బారావును చూస్తే 'వీడికి అమెరికా నీళ్ళూ, బీరూ బాగానే వంటపట్టినట్లుంది' అనుకున్నాను. సుబ్బారావు మా ఇంట్లోనే దిగాడు. రెండోరోజు ట్యాక్సీ మాట్లాడుకుని ఇద్దరం హైదరాబాదు నుంచి మా పల్లెటూరుకు బయలుదేరాం.

ఇప్పటికీ ఆ దృశ్యం నాకు బాగా గుర్తుంది.

మా వూరు వూరంతా ఓ చక్రవర్తి కోసం ఎదురుచూస్తున్నట్లుగా సుబ్బారావును రిసీవ్ చేసుకుంది. వాడి బంధువులూ, ఫ్రెండ్స్, దూరపుచుట్టాలే కాకుండా పిల్లా పీచూ అందరూ వాడి ఇంట దగ్గర చేరిపోయారు. పాతికేళ్ళ క్రితం అంటే ఇప్పటి కలా సందుకో పదిమంది ఆస్ట్రేలియాలో, వూరుకో వందమంది అమెరికాలో స్థిర పడిపోయిన రోజులు కావు. అమెరికా వెళ్ళొచ్చాడంటే బతికుండగానే వైకుంఠం చూసొచ్చిన ఫీలింగ్ జనాల్లో వుండేది. జనాల్లో వాడికున్న క్రేజ్ చూడగానే నాకు కొంచెం అసూయ కలిగినమాట వాస్తవమే.

మా నాన్నగారు పోయిన తర్వాత అమ్మ పల్లెటూర్లోనే వుండిపోయింది. సుబ్బారావు పుణ్యాన చాలారోజుల తర్వాత అమ్మ దగ్గర నాలుగు రోజులుండే అదృష్టం కలిగింది. మావి పక్కపక్క ఇళ్ళే కాబట్టి వాడి ఇంట్లో జరుగుతున్న హడావుడి స్పష్టంగా కనబడుతూనే వుండేది. చక్రవర్తి విడిదిచేస్తే సామంతరాజులు కానుకలు పట్టుకువచ్చినట్లు పల్లెటూరి జనం తేనె, ముంజెలు, జున్ను, పూతరేకులు, నాటు కోళ్ళు, బొమ్మిడాయిలు, నెయ్యి తీసుకొచ్చి అభిమానంతో వాడి ఇంట్లో ఇస్తుండే వాళ్ళు. తమ వూరి నుండి ఇంత కాలానికి ఓ వ్యక్తి అమెరికాదాకా పోయి పెద్ద ఉద్యోగం చేస్తున్నాడంటే ఆ గౌరవం తమ వూరికి ఆపాదించిన సుబ్బారావుపట్ల ప్రేమాభిమానాలు ప్రదర్శించాలనీ, గౌరవించుకోవాలనీ వాళ్ళ ఫీలింగ్. కానీ అదే సుబ్బారావును అమెరికాలో ఎవరైనా 'వాటీజ్ యువర్స్ బర్త్‌ప్లేస్?' అని అడిగితే విసుగ్గా ముఖంపెట్టి 'సమ్ డర్టీప్లేస్ విత్ ఫుల్లాఫ్ అన్ సివిలైజ్డ్ పీపుల్' అని చెబుతాడని వాళ్ళకు తెలీదు.

సుబ్బారావు తల్లిదండ్రుల్ని చూస్తే నాకు చాలా ఆశ్చర్యం కలిగేది.

వీడు అమెరికా వెళతానన్నప్పుడు వాళ్ళ నాన్నవేసిన వీరంగం నాకు ఇంకా గుర్తుంది. 'నీ తాతగాడు ఎవడిస్తాడురా డబ్బులు?' అని ఇంటి కప్పు ఎగిరిపోయేలా చిందులు వేసిన ఆయన ప్రస్తుతం ఊళ్ళో తమకు పెరిగిన గౌరవప్రతిష్ట లను మనసారా ఎంజాయ్‌చేస్తూ 'వాడెవడనుకున్నారు? ఈ పరంధామయ్య కొడుకు' అంటూ నెరిసిపోయిన తన బుంగమీసాలు మెలితిప్పుతూ వుండేవాడు.

వాళ్ళ అమ్మయితే చుట్టుపక్కల వెయ్యి కిలోమీటర్ల రేడియస్‌లో పెళ్ళి సంబంధాలు వెదుకుతూ వుండేది. తన కొడుకుని పెళ్ళి చేసుకునే అమ్మాయి ఈ భూమ్మీదకల్లా అదృష్టవంతురాలని ఆవిడ ప్రగాఢ నమ్మకం. ఆర్థికంగా స్థిరపడ్డ సంతానాన్ని చూసి తల్లిదండ్రులు ఆమాత్రం గర్వించటంలో ఎవరికీ నష్టం లేదనుకుంటా!

మా వూళ్ళో వున్న టైంలో సుబ్బారావు చాలా బిజీగా వుండేవాడు.

చుట్టుపక్కల ఊళ్ళ నుంచి కూడా జనం వాడిని చూట్టానికి వచ్చేవాళ్ళు. వాడు అమెరికా విషయాలు చెబుతుంటే సృష్టి రహస్యాలను సాక్షాత్తూ ఆ భగవంతుడే బోధిస్తున్నంత శ్రద్ధతో, భయభక్తులతో వినేవాళ్ళు. పూటకొకళ్ళ ఇంటిలో విందు భోజనం. 'ఆ పరంధామయ్యగారి అబ్బాయిని చూసి నేర్చుకోండిరా!' అని వూళ్ళోని పెద్దవాళ్ళు కుర్రకారుకి బోధ చేస్తూ వుండేవాళ్ళు. ఆవిధంగా సుబ్బారావు మొట్టమొదటిసారిగా మా వూరి నుంచి అమెరికా వెళ్ళి కీర్తిప్రతిష్టలు సంపాదించాడు.

రేపు నేను తిరిగి హైదరాబాద్ వెళ్ళిపోతాననగా ఆ రాత్రి భోజనం దగ్గర మా అమ్మ 'వాళ్ళు పదెకరాలు చేను బేరం చేసారంట్రా!' అంటూ రహస్యం చెప్పినట్లుగా చెప్పింది. నేను నవ్వి వూరుకున్నాను.

అమెరికాలో వెయ్యి ఎకరాల పొలం వుండటంకన్నా వూళ్ళో పదెకరాలు కొనుక్కోవటం వల్ల సంఘంలో పరువుప్రతిష్టలు పెరుగుతాయని సుబ్బారావు వాళ్ళ నాన్న అమెరికా డాలర్లతో పొలం కొంటున్నాడని అర్థం అయ్యింది.

అందులో తప్పుకూడా ఏమీలేదు. జనం కూడా అంతేగా!

అమెరికా వెళ్ళి పొలం కొన్నాడు, స్థలాలు సంపాదించాడు, భవంతులు కట్టించాడు అంటే గౌరవిస్తారు. అలాకాకుండా అమెరికా వెళ్ళి చదువుకొచ్చాడు. జ్ఞానం సంపాదించాడంటే నాలుక చప్పరిస్తారు.


దానికి మా అమ్మ కూడా అతీతురాలేం కాదుకదా!

** ** **

శరాను పెళ్ళి చేసుకుని సుబ్బారావు ఇండియా వచ్చాడు.

వాడి తల్లిదండ్రులు అగ్గిమీద గుగ్గిలం అయిపోయారు. ముఖ్యంగా వాళ్ళ అమ్మ కొడుకు పెళ్ళి, కట్నకానుకలూ, లాంఛనాలూ, ముచ్చట్లు గురించి ఎంతో ఘనంగా

ఊహించుకుంది. అమెరికా వెళ్ళిన ఏకైక పుత్రరత్నం వరసబెట్టి స్థలాలు, పొలాలు, ఆస్తులు కొంటున్నాడని గర్వపడ్డారుకానీ 'తెల్లదేశపు పిల్లని' కోడలి పోస్టులో కూర్చోబెడతాడని వాళ్ళు కలలో కూడా ఊహించలేదు. ఊళ్ళోని పెద్దవాళ్ళు నచ్చచెప్పిన తర్వాత కొంచెం తగ్గారు కానీ అంతర్లీనంగా వాళ్ళ ముఖాల్లో విషాదం తాండవిస్తూనే వుండేది.



మినీ స్కర్టులేసుకుని పొలాల వెంట తిరిగే శరాను ఆరోజుల్లో మా ఊళ్ళో జనం హాలీవుడ్ హీరోయిన్ అంత విస్మయంగా చూసేవాళ్ళు. 'పరంధామయ్య అదృష్టవంతుడు దొరసాని కోడలుగా వచ్చిందని' కొందరనుకుంటే 'ఈయనగారికి చుట్టుపక్కల పిల్లలే నచ్చలేదా ఏంటీ ఏకంగా తెల్లతోలు పిల్లనేసుకొచ్చాడు' అని ఇంకొంతమంది చాదస్తం వీడని పెద్దవాళ్ళు గొణుక్కునేవాళ్ళు.

ఎవరేమనుకున్నా ఎలా ఫీలయినా సుబ్బారావు పట్టించుకున్నదే లేదు. దొరసాని పెళ్ళానేసుకుని ఊళ్ళన్నీ తిరుగుతూ ఆమెకు చూపిస్తూ వుండేవాడు. ఆసరికే అమెరికా డాలర్లు వందెకరాల పైగా భూమిని కొనేసాయి కాబట్టి జనం తమ అసంతృప్తులూ, చిరాకులను దాచుకుని ముఖాలు సాగదీసి నవ్వుతూ వుండేవాళ్ళు... నెలరోజుల తర్వాత సుబ్బారావు తన దొరసాని పెళ్ళాంతో సహా తిరిగి అమెరికా వెళ్ళిపోయాడు.

పాతికేళ్ళ కాలంలో సుబ్బారావు చాలాసార్లు ఇండియా వచ్చాడు.

తల్లిదండ్రులు చనిపోయినపుడు... భార్యాబిడ్డల్ని తీసుకుని వరల్డ్ టూర్ చేస్తున్నప్పుడు... వెకేషన్స్ గడపటం కోసం... ఎక్కువగా బిజినెస్ ప్రోగ్రాం మీద ఎన్నోసార్లు ఇండియా వచ్చాడు. ఏదో ఒకటి రెండు సందర్భాల్లో తప్పించి దాదాపుగా మా ఇంట్లోనే దిగేవాడు. ప్రాణస్నేహితుడిని కలుసుకున్నందుకు నేను ఎంతగానో సంతోషించేవాడిని.

సుబ్బారావు కుటుంబంతోసహా వచ్చినపుడు మా ఆవిడ మరీ సంతోషించేది.

స్నేహితులన్నా, బంధువులన్నా విపరీతమైన అభిమానంతో సగటు భారతీయ స్త్రీకి ప్రతీక నా భార్య. ఎవరైనా ఇంటికి వస్తే వాళ్ళను సంతోషపెట్టే స్థాయిలో ఆతిథ్యం ఇవ్వాలన్నది ఆమె తపన. అర్థరాత్రిళ్ళు దాకా వంటగదిలో కుస్తీ పడుతుండే ఆవిడను చూస్తుంటే జాలీ, ప్రేమా ఉప్పొంగేది. సుబ్బారావు తన భార్య, ఇద్దరు కూతుళ్ళు, ఓ కొడుకుతో మా ఇంట్లో దిగటం ఆలస్యం మా ఆవిడ విపరీతమైన హడావుడిచేసి వాళ్ళకు ఉత్తర, దక్షిణ భారతీయ వంటకాలన్నీ వండిపెట్టేది. 'ఇంత హడావుడి అవసరమా?' అని నేను అడిగితే-

"సముద్రాలూ, ఖండాలూ దాటి వాళ్ళంత కష్టపడి వస్తే నేను చేస్తున్నదేపాటి? అందులోనూ ఆయన మీ బాల్యప్రాణ స్నేహితుడు" అనేది. ఇంక మాట్లాడటానికి ఏమీ వుండేది కాదు. ఆవిడ తత్వమే అంత. 'అతిథిదేవోభవ' అన్నది ఆవిడ ఫేవరేట్ కొటేషన్.

రెండు కుటుంబాలు కలుస్తున్నందుకు నేను కూడా చాలా సంతోషించేవాడిని. నా ఇద్దరు మొగపిల్లలూ వాళ్ళ వస్తువులూ, బొమ్మలను సుబ్బారావు పిల్లలు లాక్కుంటున్నా నవ్వే వాళ్ళు తప్ప కిక్కురుమనేవాళ్ళు కాదు. ఇదంతా మా ఆవిడ ట్రైనింగని నాకు తెలుసు. "పోన్లే పాపం. అంతదూరం నుంచి వచ్చారు ఇచ్చేయండి" అని పిల్లలకు సర్దిచెప్పేది. వాడి పిల్లలు ఇల్లంతా భీభత్సం చేసినా ఏమాత్రం విసుక్కునేది కాదు.

ఇక శరాకు, మా ఆవిడకీ వైబ్రేషన్స్ కుదర్లేదు. తనకు ఇంగ్లీషు రాదు ఆవిడకు తెలుగురాదు. భాష ఒక్కటే సమస్యకాదని త్వరలోనే నాకు అర్థమైంది. ఇద్దరూ రెండు భిన్న ధ్రువాలు. మా ఆవిడకు ఇల్లు, కుటుంబం, అతిథి సేవే లోకం... శరా ఒక్కక్షణం కూడా ఇంట్లో వుండకుండా బైట తిరుగుతుండేది. సుబ్బారావు మాలో మనిషే కానీ శరా ఆమె ముగ్గురు పిల్లలు మాతో కలవలేకపోయారు. వాళ్ళకు మా ఇల్లు ఆఫ్రికన్ జంగిల్లా వుందని అర్థమైపోయింది. ఏసీ లేదని శరా విసుక్కునేది. 'హారిబుల్... హౌ కెన్ ఎనీబడీ లివ్?' అంటూ గొణుక్కునేది.

వాళ్ళ ఆయన ఏ సౌకర్యాలూ, సుఖాలు లేని అడివిలోకి తీసుకొచ్చినట్లు ఫీలయ్యేది. ఇలా రెండు, మూడుసార్లు జరిగిన తర్వాత సుబ్బారావు ఫ్యామిలీతో సహా ఫైవ్‌స్టార్ హోటల్లో దిగినా నేను ఫీల్‌కాలేదుకానీ మా ఆవిడ రాత్రంతా బాధపడింది. తనో పిచ్చి మాలోకం. తన ఆతిథ్యంలోనే ఏదో లోపం వుందన్నది ఆవిడ ఫీలింగ్. ఏసీలూ, కార్లూ లేకుండా వాళ్ళు బతకలేరని తనకు తెలీదు.

చదువుకునే రోజుల్లో సుబ్బారావు చాలా సెన్సిటివ్‌గా వుండేవాడు.

ఇద్దరం వెన్నెల్లో కూర్చుని కృష్ణశాస్త్రి, కీట్స్ పొయెట్రీ, చలం నవలల గురించి లక్షా తొంభై టాపిక్కులు చర్చించుకునే వాళ్ళం. కానీ అమెరికా వెళ్ళాక సుబ్బారావు చాలా మారిపోయాడు. పరిస్థితుల ప్రభావమో, శరా సాహచర్యమో తెలీదుకానీ సుబ్బారావులో మార్పు రావటం మొదలయ్యింది. విమానం దిగినప్పటినుంచి తిరిగి విమానం ఎక్కేంతవరకూ ఎంతసేపూ అమెరికా జీవితం గొప్పతనం గురించి నాన్‌స్టాప్ లెక్చర్లు దంచటం మొదలెట్టాడు.

'ఈ డర్టీ పొల్యూషన్, దరిద్రపు తిండీ తింటూ ఎలా బతుకుతున్నారు మీరు?' అని వాడు దేశాన్నీ, ఇక్కడి మనుషులనూ ఈసడించుకుంటుంటే విపరీతమైన బాధేసేది. మనస్సు చివుక్కుమనేది. "ఈ దరిద్రపు గాలిపీల్చి, తిండితినే ఇంతటి వాడినయ్యి అమెరికాలో ఊరేగుతున్నావు నాయనా... గతాన్ని మర్చిపోకు" అని ఘాటుగా సమాధానం చెప్పాలనిపించినా నిగ్రహించుకునేవాడిని.

సుబ్బారావులో తీవ్రమైన మార్పులు రూపుదిద్దుకోసాగాయి. నోరు తెరిస్తే ఇండియానీ, ఇక్కడి ప్రజల జీవిత విధానాన్నీ ఘోరంగా తూర్పారపట్టి అసహ్యించుకునేవాడు. మాతృదేశాన్ని తిట్టటం లేటెస్ట్ ఫ్యాషనేమో నాకు తెలీదుకానీ వీడసలు మా సుబ్బారావేనా అనే సందేహం వస్తుండేది. వాడి సెన్సివిటీని, సంస్కారాన్నీ పాశ్చాత్య నాగరికత మింగేసిందని నాకు క్రమక్రమంగా అర్థమవసాగింది. ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో వ్యాపార ప్రముఖులతో నిరంతరం చర్చిస్తూ వుండేవాడు. వాడు ఇండియా వస్తున్నది వాడి వైభోగాన్నీ, సంపదనూ నాదగ్గర ప్రదర్శించటానికే అని ఒక్కోసారి అన్పించేది కూడా.

ఓ రోజు నన్ను అడిగాడు "ఒరే అర్జూ... ఎంత సంపాదించావేంట్రా?" అని.

"ప్రశాంతంగా, సుఖంగా బతకటానికి కావల్సినంత" నేను నవ్వుతూ అన్నాను.

"సుఖంగా అంటే మెర్సిడెజ్ కారువుందా?" అనడిగాడు.

"లేదు..."

"ఇల్లు మొత్తం ఏసీ చేయించావా?"

"లేదు... ఎయిర్ కూలర్ వుంది"

మారుమూల అడవుల్లో వుండే ఆటవికుల్ని ఎంత ఆశ్చర్యంగా చూస్తారో అంత ఆశ్చర్యంగా చూసాడు నావంక. డబ్బు సంపాదన గురించీ, దానివల్ల వచ్చే లగ్జరీలు, సుఖాల గురించీ సంఘంలో పెరిగే పేరుప్రఖ్యాతుల గురించీ నీకు గంటసేపు లెక్చర్ దంచాడు. ఇదేవిధంగా వుంటే నేనూ, నా కుటుంబం వెనకబడిపోతామని హెచ్చరించాడు.

దేంట్లో వెనకపడిపోతామని నేను ప్రశ్నించలేదు. ఎందుకంటే నాకు తెలుసు.

తోటివాడికన్నా ఎక్కువ సంపాదించేస్తూ సుఖాలను నాలుగు చేతులా జుర్రేయ్యాలన్న 'రాట్‌రేస్'లో నేను వెనకబడిపోతానని వాడి అభిప్రాయం. అసలు నేను ఆ పోటీలోనే లేనపుడు వెనకబడే సమస్యేముందన్నది నా ఫీలింగ్. సుఖం అనేది డబ్బు సంపాదన, ఏసీలు, బెంజ్‌కార్లతో రాదనీ

'ఈ డర్టీ పొల్యూషన్, దరిద్రపు తిండీ తింటూ ఎలా బతుకుతున్నారు మీరు?' అని వాడు దేశాన్నీ, ఇక్కడి మనుషులనూ ఈసడించుకుంటుంటే విపరీతమైన బాధేసేది. మనస్సు చివుక్కుమనేది. "ఈ దరిద్రపు గాలిపీల్చి, తిండితినే ఇంతటివాడినయ్యి అమెరికాలో ఊరేగుతున్నావు నాయనా... గతాన్ని మర్చిపోకు" అని ఘాటుగా సమాధానం చెప్పాలనిపించినా నిగ్రహించుకునేవాడిని.

ప్రశాంతంగా, ఆరోగ్యంగా, గౌరవంగా బతకటమే నిజమైన సుఖం అన్న విషయం నేను వాడికి చెప్పలేదు. ఎందుకంటే వాడు వినడు. వాడు చెప్పింది నేను వింటున్నాను కనుకా నేను చెప్పింది వాడు వినటానికి?

"డబ్బుంటేనేరా లోకం గౌరవించేది. నీకు తెలుసుగా మన వూళ్ళో మా నాన్నను ఏనాడైనా, ఎవ్వడైనా పట్టించుకున్నారా? మరి ఇప్పుడు ఆయన అడుగులకు మడుగులొత్తుతున్నారు. 'దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్!' అన్నాడో మహానుభావుడు. ఆ రోజులకి అది కరెక్ట్. కానీ ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో 'దేశమంటే డాలర్లోయ్!' అన్నది జీవిత సత్యం. నువ్వు పనికిమాలిన సెంటిమెంట్లు, దేశభక్తిని పట్టుకుని వేలాడినంతవరకు ఇలాగే వుంటావు..." అంటూ నామీద జాలి ప్రదర్శించేవాడు. అమెరికాలో వాడు బతుకుతున్న జీవితం గొప్పదే కావచ్చు అంతమాత్రాన ఇండియాను తిట్టాల్సిన అవసరం ఏముందో నాకు అర్థంకాలేదు.

మనం అంతా తల్లిపాలు తాగే పెరుగుతాం. పెరిగిన తర్వాత ఆ తల్లి రొమ్ముల్లోంచి 'కోక్' రావడంలేదని ఈసడిస్తే ఆ తప్పు తల్లిదా?

** ** **

సుబ్బారావు దేశాన్ని, ఇక్కడి మనుషుల్ని తిడుతున్న ప్రతిసారీ నేను గౌతమబుద్ధడంత నిగ్రహం ప్రదర్శించలేకపోయేవాడిని. అంతమాత్రాన "ఏంట్రా కూస్తున్నావు దేశద్రోహీ... ఇక్కడ పుట్టిపెరిగి ఈ దేశ సంపదతో చదువుకుని, డబ్బు సంపాదన కోసం పరాయి దేశం పోయిన నీకు ఈ దేశాన్ని విమర్శించే అర్హత ఏదిరా?" అని పరుషంగా మాట్లాడలేకపోయినా మృదువుగా, సున్నితంగా వాడి అభిప్రాయాలను ఖండించేవాడిని. "ఒరే సుబ్బారావూ... మీకు అమెరికాలో వున్నట్లుగా కార్లు, ఏసీలూ, బ్రహ్మాండమైన జీవన సౌఖ్యాలు ఇక్కడ లేకపోవచ్చు కానీ ఈ దేశానికి ఓ చరిత్ర సంస్కృతి వుంది. భారతీయ కుటుంబ విలువలూ, సంస్కృతీ ఎంతో ఉన్నతమైనవని అమెరికన్లు కూడా చెబుతున్నారుగా?" అని సున్నితంగా ప్రశ్నించేవాడిని.

"సంస్కృతా? వంకాయపచ్చడా? గతిలేక బతుకుతున్నారు కానీ వీసాలిచ్చి చూడు... ఇక్కడ ఒక్కడుంటే ఒట్టు... ఏం దేశం? ఏం మనుషులు? ఏం బతుకులు?" అంటూ ఈసడించేవాడు.

మామధ్య ఎన్నిసార్లు చర్చలు జరిగినా వాడి అభిప్రాయాలు మారేవికాదు. ఈ దేశంలో బతకటం అంటే ఏదో ఘోరమైన పాపం చేసినట్లు... "ఇక్కడ



**నా అడుగుల సవ్వడికి బల్లముందు కూర్చుని ఏదో చదువుకుంటున్న ఆయన తలెత్తి చూసాడు. తెల్లటి బట్టలూ, పెరిగిన గడ్డం, శుష్కించిన శరీరం కానీ ముఖంలో తేజస్సూ... బ్రహ్మాండమైన ప్రశాంతత. నేను దిగ్భ్రాంతుడినై చూసాను.**

డిసిప్లయిన్ లేదు. మనుషులు సోమరులు. పనికిమాలిన విషయాలకు 'సెంటిమెంట్స్' ముసుగేసుకుని ఆత్మవంచన చేసుకుంటూ ఉంటారు" ఇలా అన్నీ నెగటివ్ ఫీలింగ్స్ మాత్రమే వాడికి ఉండేవి. నాకు చాలా ఆశ్చర్యం వేసేది.

సుబ్బారావే కాకుండా నాకు తెలిసిన కొంతమంది బంధువులు, ఫ్రెండ్స్ న్యూజిలాండ్, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో వుంటున్నారు. వాళ్ళు సాధారణంగా మిగతా విషయాలు మాట్లాడినా "డబ్బు సంపాదించాలని పోవటమేకానీ మనదేశంలో వున్నంత ప్రశాంతత, సెక్యూరిటీ ఎక్కడ వుంటుందండీ? అంతా కమర్షియల్ స్నేహాలూ, ప్లాస్టిక్ నవ్వులూ... ఆఖరకు ఇంట్లో కూడా మొగుడుపెళ్ళాలూ, కన్నబిడ్డల మధ్య కూడా కుటుంబంలాగా కాకుండా ఏదో వ్యాపారంలా ఉంటుంది..." అనో "మన ఆవకాయపచ్చడీ, కృష్ణానదీ, పొలాలు, పల్లెటూర్లు అన్నింటికీ దూరంగా ఎక్కడో దేశంకాని దేశంలో బతకటం ఎంతో దురదృష్టం" అంటూ బాధపడుతూ వుంటారు. వాళ్ళు కూడా సందర్భోచితంగా ఒకటి రెండు విమర్శలు చేసి నా సుబ్బారావుకు మల్లే ప్రతి విషయానికీ దేశాన్ని మాత్రం తిట్టరు. కన్నతల్లికి దూరంగా వుంటున్నామని బాధపడతారు.

సుబ్బారావు మాత్రం నిరంతరం దేశాన్నీ, భారతీయ సెంటిమెంట్స్, విలువలను తిడుతూనే వుండేవాడు.

కొందరికి కొన్ని అభిప్రాయాలుంటాయి. అవి ఎప్పటికీ మారవు. వాటిని మార్చాలని ప్రయత్నించడం మూర్ఖత్వం. సుబ్బారావుకు సంబంధించి నేను పదేపదే నా మూర్ఖత్వాన్ని ప్రదర్శించదల్చుకోలేదు.

** ** **

రెండేళ్ళు గడిచిపోయాయి.

కాలప్రవాహంలో రెండేళ్ళంటే ఎంతనో పిపీలకమంత.

నా సర్వీస్ పీరియడ్ ఇంకో ఎనిమిదేళ్ళున్నా ఇంకా కొన్ని బాధ్యతలు మిగిలే వున్నాయి. నా ఇద్దరు కొడుకులు ఇంకా సెటిల్ కాలేదు. సుబ్బారావు చాలా మందిని అమెరికా తీసుకువెళ్ళాడని తెలుసు. అయినా నా కొడుకుల విషయంలో వాడిని నేను ఏనాడూ సహాయం అడగలేదు. నిజమైన టాలెంటు వుంటే ఇండియాలోనే హాయిగా బతకచ్చన్నది నా అభిప్రాయం. అదీకాకుండా గత రెండేళ్ళనుంచీ సుబ్బారావు నాకు దూరంగా వుంటున్నాడు.

దూరంగా వుండటం అంటే సుబ్బారావు నుంచి ఏ కబురూ లేదు. నేను దాదాపుగా ఇరవైసార్లు ఫోన్ చేసాను. ఫోన్ చేసిన ప్రతిసారీ వాయిస్ మిషన్ సమాధానం చెప్పేది. నేను మెసేజ్ పెట్టేవాడిని. ఏనాడూ సుబ్బారావు తిరిగి ఫోన్ చేయలేదు. నేను ఉత్తరాలు రాసినా, ఈమెయిల్స్ పంపినా వేటికీ సమాధానంలేదు. దాంతో నేనూ ఊరుకున్నాను. స్నేహం అనేది కేవలం ఓవైపు నుంచి వుంటే సరిపోదు. ఎదుగుతున్న సుబ్బారావు సర్కిల్‌లో నేను వృధా అని తను నన్ను వదిలేసి వుండవచ్చు. కాలిఫోర్నియా కోటీశ్వరుడికి నాలాంటి సాధారణ ఇంజనీర్‌తో పనేముంటుంది?

నాకు దుఃఖం కలిగేది... బాల్యం గుర్తుకు వచ్చేది. డబ్బు దాహం మా విలువైన స్నేహాన్ని కొండచిలువలా మింగేసింది. నేనేం చేయగలను? నిస్సహాయుడిని...

డబ్బు అనేది విలువైనదే కానీ మానవ సంబంధాలను శాసించేంత విలువైనది మాత్రంకాదు. జీవించడం అంటే ప్రతి విషయాన్నీ, బంధాన్నీ, ఆర్థికపరమైన కాలిక్యులేషన్స్‌తో వ్యాపారం చేయటంకాదుకదా! నిజంగానే డబ్బులో అంత సంతోషం, సుఖం వుండి వుంటే కోటీశ్వరులంతా అంతటి ప్రశాంతతతో బతకాలికదా! వాళ్ళంతా నిజంగానే హాయిగా వుండగలుగుతున్నారా? ఇలా ఎంత నచ్చచెప్పుకున్నా సుబ్బారావు నా మనసులో మెదులుతూనే వుండేవాడు.

కొంతకాలం తర్వాత నాకో విచిత్రమైన ఆహ్వానం వచ్చింది.

"మీరు వీలు చూసుకుని మా ఆశ్రమాన్ని సందర్శిస్తారని ఆశిస్తున్నాం..." 'ప్రకృతి' అనే ఆశ్రమం పేరిట వున్న లెటర్ హెడ్‌మీద నాకు పంపబడ్డ ఆహ్వానం అది. నేను ఆశ్చర్యపోయాను. నేనేమీ మహాదాతనుకాను, విఐపీని అంతకంటేకాదు. మరి నాకు ఆహ్వానం పంపేదెవరు? పొరపాటున వేరేవాళ్ళ ఆహ్వానం నాకు వచ్చిందా? లేదు... అడ్రస్ కరెక్టుగానే వుంది... రోజులు గడిచేకొద్దీ ఆ విషయమే మర్చిపోయాను.

మూడు నెలల తర్వాత ఓ శనివారం సాయంత్రం మేడమీద బద్ధకంగా తిరుగుతున్న సమయంలో



## అతిథిగా వెళుతున్నారా?

స్నేహితులు, చుట్టాలు ఇంటికి అతిథిగా వెళ్ళినప్పుడు వారికి ఇబ్బంది కలుగకుండా వుండాలంటే కొన్నివద్ధతులను పాటిస్తే ఏవిధమైన చికాకులు లేకుండా అందరికీ ఆనందదాయకంగా వుంటుంది.

* ఎవరింటికైనా వెళ్ళినప్పుడు సరాసరి లోపలకు వెళ్ళకుండా కాలింగ్‌బెల్ నొక్కి వారుబయటకు వచ్చే వరకు ఎదురుచూడాలి.

* మంచినీళ్ళను నోటికి ఆనించుకొని తాగడం కన్నా ఎత్తిపోసుకుంటేనే సదభిప్రాయం కలుగుతుంది.

* కావలసిన వ్యక్తి ఇంట్లో లేకపోతే వెంటనే వెనక్కి రావడం మంచిది. లేకపోతే ఇంట్లోవున్న వారికి ఇబ్బంది వుండదు.

* ఫలహారం ప్లేటులో చేతులు కడగడం మంచి అలవాటు కాదు. నీళ్ళు ప్లేటులోవుంటే ఇంటివాళ్ళకి తీసుకెళ్ళడం కష్టంగా వుంటుంది.

* చిన్నపిల్లలతో ఎవరింటికైనా వెళితే అల్లరిచేయకుండా ముందుగానే వారికి తగిన సూచనలు ఇవ్వాలి.

హఠాత్తుగా ఆహ్వానం విషయం గుర్తుకువచ్చింది. వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. ఆదివారం ఉదయమే ఇంట్లో చెప్పి బయలుదేరాను.

తెలంగాణాలోని ఓ మారుమూల పల్లెటూరు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా దేశంలోని ఎన్నో లక్షల గ్రామాలు ఇంతగా వెనుకబడి వుండటానికి కారణం అందరూ నగరాలవైపు పరుగులు పెట్టటమేనా అన్పించింది ఆ పరిసరాలు చూస్తుంటే... నాలుగు గంటల ప్రయాణం తర్వాత బస్సు ఆ వూరు చేరుకుంది. బస్సు దిగి చుట్టూ చూశాను. ఎవ్వరూ తెలీదు. కొత్త పరిసరాలు. వాతావరణం. గ్రామస్తులను అడ్రస్ అడిగాను. నాకు దారి చూపించేందుకు చిన్న కుర్రాడిని పంపారు. ఇరవై నిమిషాల నడక తర్వాత అక్కడికి చేరుకున్నాం. గేటు దాటి లోపలకు అడుగుపెట్టిన నేను మైమరిచిపోయాను.

ఎంత అద్భుతంగా వుంది?

పచ్చని చెట్లు... పూలవాసనలను మోసుకువస్తున్న చల్లటిగాలి... విశాలమైన ప్రాంగణం. ఉదయం తొమ్మిదిన్నరవుతుంది. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. చిన్నచిన్న పెంకుటిళ్ళులాంటి కట్టడాలు... నేను 'ప్రకృతి'ని వర్ణించలేను. వృద్ధులూ, పిల్లలూ అందరూ శాంతి కపోతాల్లా వున్నారు. క్రమశిక్షణతో పెరుగుతున్న సైన్యంలా ఆత్మవిశ్వాసంతో పవిత్రంగా వున్నారు. సమాజం, బిడ్డలు నిర్లక్ష్యంచేసిన వృద్ధులు అనాథ బాలలను తీర్చిదిద్దుతున్నారు. భావిభారత పౌరులను రూపొందిస్తున్నారు.

వాళ్ళకు లేని సౌకర్యాలు లేవు. అదేవిధంగా ఏ ఒక్క లగ్జరీ కూడా లేదు. వాళ్ళ ఆహారం, కూరలూ వాళ్ళే పండించుకుంటున్నారు. ఆ 'ప్రకృతి' ఆశ్రమం స్వయం సమృద్ధి సాధించిన స్వర్గంలా వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే పూజ్య బాపూజీ కలలుకన్న 'ఉటోపియన్ విలేజ్'లా వుంది. ఆ పరిసరాలు చూసి నేను మంత్రముగ్ధుడినైపోయాను. ఏ మహానుభావుడు దీన్ని రూపొందించాడు? ఆయనను చూసి జన్మధన్యం చేసుకునేందుకు ముందుకుసాగాను.

ఎవ్వరూ నన్ను పట్టించుకోలేదు. ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. ఐదు నిమిషాల తర్వాత 'ఆఫీస్' అన్న బోర్డు చూసి లోపలకు నడిచాను. నా అడుగుల సవ్వడికి బల్లముందు కూర్చుని ఏదో చదువుకుంటున్న ఆయన తలెత్తి చూసాడు. తెల్లటి బట్టలూ, పెరిగిన గడ్డం, శుష్కించిన శరీరం కానీ ముఖంలో తేజస్సూ... బ్రహ్మాండమైన ప్రశాంతత.

నేను దిగ్భ్రాంతుడినై చూసాను.

ఆ ముతకబట్టలూ, గడ్డం తీసేసి చూస్తే... ఆ శరీరానికి ఖరీదైన సూట్‌వేసి చూస్తే... ఎవరు? ఇంకెవరు?

సు...బ్బా...రా...వు...

"మీరూ... మీ... సు... సువ్వు..." నా మాటలు తడబడ్డాయి.

సుబ్బారావు నవ్వేడు "కూర్చో...." అన్నాడు.

నేను మంత్రముగ్ధుడిలా కూర్చున్నాను. కాలిఫోర్నియా కోటీశ్వరుడు... అనుక్షణం సుఖాల్లో తేలియాడే విలాస పురుషుడు... కాలాన్నీ, స్నేహాన్నీ డాలర్లతో లెక్కించే ఎకనమిస్ట్... అనుక్షణం బిజీగా పరుగులు పెట్టే మెటీరియలిస్ట్... ఇంత ప్రశాంతంగా, ముతక బట్టలు కట్టుకుని ఓ కుగ్రామంలాంటి ప్రాంతంలో...

నా సందేహాలను గ్రహించినట్లుగా సుబ్బారావు మళ్ళీ నవ్వేడు.

"ఇదంతా ఆశ్చర్యంగా వుందికదూ! వుంటుంది... జీవితం అంటే అదేగా మరి... అనుకున్నవి జరగవు... ప్రపంచంలోకెల్లా ధనవంతుడ్ని కావాలన్నది నా లక్ష్యం. దానికోసం నిద్రాహారాలు మానేసి రాత్రింబవళ్ళు శ్రమించాను. సంపదను మూటగట్టాను. ఈ దేశాన్నీ, మనుషులనూ, విలువలనూ అసహ్యించుకున్నాను. ఈసడించాను. దారుణంగా విమర్శించాను. మెట్టవేదాంతం చెప్పద్దంటూ నీమీద ఎన్నోసార్లు విసుక్కున్నాను. సుఖాల్లో మునిగితేలాను... జీవితం అంటే డాలర్లు సంపాదించటం, అనుభవించటం అన్న ఫిలాసఫీని రూపొందించుకున్నాను. అంతా బాగానే వుంది... నాకు లివర్ క్యాన్సర్ వచ్చేంతవరకూ..."

నేను ఉలిక్కిపడ్డాను.

"అవును... నాకు లివర్ క్యాన్సరని ప్రపంచంలోకెల్లా ప్రముఖ 'అంకాలజిస్ట్' చెప్పినప్పుడు నేను పెద్దగా కేర్ చేయలేదు. మిలియన్స్ డాలర్ల ఆస్తి, ప్రేమాభిమానాలు కురిపించే కుటుంబ సభ్యులు, ప్రముఖులైన స్నేహితులు వున్నపుడు నేను ఏ రోగాన్నయినా నయం చేసుకోగలనని భావించాను... కానీ... కానీ... క్యాన్సర్‌కంటే పెద్ద దెబ్బ నా ప్రియాతిప్రియమైన భార్య ఇస్తుందని జీవితంలో ఊహించలేదు. శరా నాకు విడాకులిచ్చేసింది. నా పిల్లలు వాళ్ళ సుఖాల అన్వేషణలో బిజీగా వున్నారు. నా మిత్రులు ఇక పనికిరాని ఈ రోగిష్టిని వదిలేసారు.

నాకు ప్రపంచం శూన్యమైపోయింది?

విధి ఎంత గ్రాండ్‌గా నామీద కక్ష తీర్చుకుందో చూసావా? నేను ఎవరికోసం అనుక్షణం తపించానో వాళ్ళే నన్ను అవసరం తీరాక డంప్ చేసారు...

అది వాళ్ళ తప్పుకాదు. ఒకప్పుడు నా ఫిలాసఫీ కూడా అదేగా!

అమెరికాలో వున్న నాయావదాస్తీ భార్యాబిడ్డలకు ఇచ్చేసాను. భారతదేశం వచ్చి హిమాలయాల నుండి కన్యాకుమారి దాకా తిరిగాను. యోగా నేర్చుకున్నాను. ప్రాణాయామం చేసాను. సాత్వికాహారం తీసుకున్నాను. దట్టమైన అంధకారంలో నుంచి ఓ కాంతిపుంజం కన్పించింది. ఎప్పుడో వూళ్ళో మీసం మెలేయటానికి మా నాన్న కొనిపెట్టిన పొలాలు, స్థలాలూ, ఆస్తులూ అన్నీ అమ్మేసి ఈ ప్రకృతి ఆశ్రమం ఏర్పాటుచేసాను. తల్లి వడికి చేరుకున్న ప్రశాంతత, శాంతినీ అనుభవించాను... ఒకప్పుడు డబ్బూ, సుఖాలే లక్ష్యంగా బతికాను. అది ఎంత ఘోరమైన తప్పో నాకు అర్థమైంది. సుఖాలతో విలాసంగా ఖుషీ చేయటం జీవితంకాదని అర్థమైంది. బాల్యాన్నీ, రెండో బాల్యాన్నీ ఓ చోట పవిత్రమైన వాతావరణంలో దగ్గరదగ్గరగా వుంచితే ఎంతటి అద్భుతమైన మార్పులు వస్తాయో ఈ ప్రకృతి నాకు నేర్పింది. జీవితం అంటే ఏమిటో నాకు అర్థమైపోయిందని చెప్పను. ఎందుకంటే అది ఎంతటి గొప్పదో తెలుసుకున్నాను కాబట్టి... శరీరం అనే నీటి బుడగ ప్రేలిపోయేలోగా నాకు చేతనయినంత చేస్తూ నా తల్లి వడిలో రాలిపోవాలన్నదే నా కోర్కె..."

నేను అలాగే సుబ్బారావు వంక దిగ్భ్రాంతుడినై చూస్తుండిపోయాను.

అతను రాగద్వేషాలను జయించిన యోగిలా వున్నాడు. భౌతిక సుఖాలనే ఎండమావుల వెంట పరుగులు ఆత్మ తాలూకు దాహాన్ని తీర్చలేవని ప్రపంచానికి చాటి చెబుతున్న ఋషిలా వున్నాడు. ●

## వాస్తవంగా కాలసర్పయోగం ఉంటుందా?

గ్రహాల కక్ష్య జన్మకుండలిలోని ఏదో ఒక స్థానంలో ఉన్న ఆ స్థితిని 'యోగం' అంటారు. జ్యోతిష్యశాస్త్రంలో యోగాలను మహత్వపూర్ణంగా చెప్పారు. యోగమనగా కలయిక అనికూడా అర్థం ఉంది. జన్మకుండలిలో అన్నిగ్రహాలు రాహుకేతువుల మధ్యలో ఉన్న అట్టి గ్రహస్థితిని 'కాలసర్పయోగం' అంటారు. కాలసర్ప యోగం ఒక భయానక యోగం. ఐహిక లేదా సంసారిక జ్యోతిష్యశాస్త్రంలో ఈ యోగానికి విపరీత పరిణామాలు కనపడతాయి. భారతీయ ప్రాచీన జ్యోతిష్య శాస్త్రం ఈ యోగం గురించి శోధించలేదు. ఆధునిక జ్యోతిష్య విద్వాంసులు కూడా ఈ కాలసర్పయోగం గురించి వివరించే ప్రయత్నం చేయలేదు. అయితే జాతకుని జీవితంలో ఈ యోగం పరిణామం ఉంటుందా?

గత ఇరవై సంవత్సరాలుగా లక్షకుపైగా జాతకాలను జిజ్ఞాస పూర్ణంగా గ్రహించి అధ్యయనం చేసి విచారణ జరిపిన పిమ్మట మా దృఢ నమ్మకమేమనగా జ్యోతిష్యశాస్త్రంలో 'కాలసర్పయోగం' ఉంది. జ్యోతిష్య పండితులకు మా వినమ్ర నివేదన ఏమనగా సూర్యునికి రెండువైపులా గ్రహాలున్న 'వెలీ', 'వాసి' ఉభయ చారి యోగము ఉండును. చంద్రునికి ఇరువైపులా గ్రహాలున్న 'అనఫ', 'సునఫ', 'దుర్ధరా' 'కేమద్రుమ' యోగం కలుగుతుంది. శనితోపాటు చంద్రుడున్న 'విషయోగం' కలుగుతుంది. చంద్రునితోపాటు రాహువున్న 'ఛండాల యోగం' కలుగుతుంది. అదేవిధంగా రాహుకేతువుల మధ్యలో అన్ని గ్రహాలుంటే కలిగే యోగం 'కాలసర్ప యోగం' అనటంలో ఎటువంటి అభ్యంతరం ఉండకూడదు. రాహుకేతువుల ద్వారా అన్ని గ్రహాలు స్పందించిన ఆ జాతకుని యందు వాటి వల్ల కలిగే చెడు ప్రభావాలను ఎలా కాదనగలరు? 'మహర్షి పరాశర', 'వరాహమిహిర' వంటి గొప్ప జ్యోతిష్య ఆచార్యులే 'కాలసర్పయోగాన్ని' ఒప్పుకున్నారు. వారు గ్రంథాలలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. మహర్షి భృగు, కళ్యాణ వర్మ బాదరాయణ, గర్గ, మణిత్య మొదలైనవారు కూడా కాలసర్పయోగానికి ఋజువు చేసారు. వారణాశి నుండి వెలువడే 'వ్యావహారిక జ్యోతిష్యతత్వం' జన్మాంగ ఫలవిచారం అనే గ్రంథాలలో కాలసర్పయోగ నివారణ ఉపాయాలు కూడా చెప్పారు.

**అగ్రేవా చేతు పృష్ఠతో ప్రత్యేక పార్శ్వే భాతాష్టకే**
**రాహుకేత్వోన ఖేటః!**
**యోగ ప్రోక్త సర్పశ్చ తస్మిన్నే జీతో జీతః వ్యర్థ పుత్రర్తి**
**పీయాతు!!**
**రాహుకేతు మధ్యే సప్తో విఘ్నాహ కాలసర్ప సారికః!**
**సుతయాసాది సకలదోష రోగేణ ప్రవాసె చరణం**
**ధృవమ్!!**

**కాలసర్పయోగస్థ విషవిషాక్త జీవనె భయావహ**
**పునః పునరపి శోకం చ యోషణె**
**రోగాంతాధికం పూర్వజన్మకృతం పాపం**
**బ్రహ్మాశాపాత్ సుతక్షయః కించిత్ ధృవమ్**
**ప్రేతాదివశం సుఖం సౌఖ్యం వినశ్యతి!!**
**భైరవాష్టక ప్రయోగేన కాలసర్పాది భయం వినశ్యతి!**

పై రెండు శ్లోకాల ప్రకారం రాహుకేతువుల మధ్యలో అన్ని గ్రహాలు ఉండాలి. అంతేగాక ఒక్క స్థానం కూడా ఖాళీగా ఉండరాదు. అప్పుడే పూర్ణ కాలసర్ప యోగం అవుతుంది.

**- డా॥ ఆమంచి బాలసుధాకరశాస్త్రి**